బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- దొరపల్లెకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి బుగ్గన
- అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ

డోన్ : రోడ్డు ప్రమాదం బాధాకరమని, మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని, అన్నివిధాలుగా ఆదుకుంటామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని దొరపల్లి గ్రామం వద్ద 44వ జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో దొరపల్లి గ్రామానికి చెందిన బొందిమడుగుల రామకృష్ణ(44), ఎల్లకృష్ణ (34), డోన్ పట్టణంలోని సుజాతమ్మ నగర్ కాలనీకి చెందిన సందీష్ (32) మృతి చెందారు. డోన్‌లో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు రామకృష్ణ(44), ఎల్లకృష్ణ బైక్‌పై... కొత్తపల్లి వద్ద ఉన్న డాబాలో భోజనం చేసిన సందీష్ తన బైక్‌పై తిరిగి బయలుదేరగా హైదరాబాదు నుంచి బెంగుళూరు వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం రాత్రి దొరపల్లికు వెళ్లి బొందిమడుగుల రామకృష్ణ, ఎల్లకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దని ఓదార్చిన మంత్రి ప్రభుత్వంతో పాటు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని చెప్పారు. రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. వివిధ గ్రామాల నుంచి దొరపల్లె, మల్లెంపల్లె, లక్ష్మంపల్లె గ్రామాలకు రావడానికి ఎన్‌హెచ్ 44 దాటాల్సి ఉంటుందని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవి, మల్లెంపల్లె రామచంద్రుడు మంత్రి బుగ్గన దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే రోడ్డు దాటుతూ ప్రమాదవశాత్తు 18 మంది వరకు మరణించారని వారు తెలిపారు. హైవేపై పలు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ ఇక్కడ ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు రైల్వే వారు బ్రిడ్జి కింద డబుల్ లైన్ పేరుతో రాకపోకలను బంద్ చేయడం మూలంగా ప్రమాదాలు తరచుగా చోటుచేసుకుంటున్నాయన్నారు. స్పందించిన మంత్రి ప్రస్తుతం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ముఖద్వారం మీదుగా గ్రామం వద్దగల రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నుంచి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని పంచాయతీ రాజ్ అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. నిత్యం విద్యార్థులు సైకిళ్లపై డోన్‌కు వచ్చి వెళ్తుంటారని, మరికొందరు రైలు పట్టాలపై నడిచి గ్రామానికి వస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారని, ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యం తగదని హెచ్చరించిన మంత్రి రహదారి సౌకర్యంకల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు ఇకపై జరగకుండా ఉండేందుకు త్వరలోనే శాశ్వత రహదారి సౌకర్యాన్ని కల్పిస్తామని ఆయన హామీనిచ్చారు.


దొరపల్లె గ్రామంలో మృతుల కుటుంబాల సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి...

డోన్ టౌన్: మండల పరిధిలోని దొరపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దొరపల్లి గ్రామానికి చెందిన బొందిమడుగుల రామకృష్ణ, ఎల్లకృష్ణ, డోన్ పట్టణంలోని సుజాతమ్మ నగర్ కాలనీకి చెందిన సందీష్ కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా చెల్లించి ఆదుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి గార్లపాటి మద్దిలేటి, కార్యదర్శి ఉన్నగోర్ల జనార్దన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా రైల్వే బ్రిడ్జి వద్ద సబ్‌వే లేదా జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. సమావేశంలో నాయకులు సునిత, సుబ్బుయాదవ్, శేషయ్య పాల్గొన్నారు.

మహిళలకు ప్రోత్సాహక బహుమతులు

డోన్ టౌన్: సంక్రాంతి పర్వ దినాన్ని పురస్కరించుకు ఇళ్ల ముంగిట అందంగా ముగ్గులు వేసుకున్న మహిళలకు ఇన్నర్‌వీల్ సభ్యులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పండుగ రోజు ఆదివారం పట్టణంలోని శ్రీరాంనగర్, గుంటూరు సుబ్బారావు తదితర కాలనీల్లో ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు శాంతి సభ్యుతో కలిసి పర్యటించారు. అందంగా ముగ్గులు వేసిన మహిళలకు ఇన్నర్‌వీల్ క్లబ్ డోన్ ప్రాంత వ్యవస్థాపకురాలు రాజా సుజాత ఆర్థిక సాయంలో బహుమతులు అందజేశారు.

శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారిపై సూర్యకిరణాలు



బనగానపల్లెరూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహంపై ఆదివారం సూర్యకిరణాలు ప్రసరించడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రతి ఏడాది ఉత్తరాయణ పుణ్యకాలంలో సంక్రాంతి పండుగా రోజు ఉదయం వేళలో సూర్యకిరణాలు గర్భగుడిలో ఉన్న అమ్మవారిపై ప్రసరించడం జరుగుతుందని ఆలయ ఈఓ రామానుజన్ తెలిపారు.

క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం మేనేజర్ అబ్దుల్ హుశేన్ ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత బృందం సభ్యులు పొదుపు ఎలా చేసుకోవాలనే వాటిపై కళా రూపంలో వివరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ హుశేన్ ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంక్‌లో పొదుపు ఖాతా చేసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి, సురక్షా బీమా యోజన తదితర స్కీంలలో చేరాలని తెలిపారు. అన్నికాల ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల కంటే అత్యధిక వడ్డీ ఇస్తున్న ఏకైక బ్యాంక్ ఏపీజీపీ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరసన్న,క్లర్క్ భువనేశ్వరరెడ్డి,అసిస్టెంట్ జాఫర్ పాల్గొన్నారు.

పరామర్శ


కొండారెడ్డితో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెద్దవెంతుర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొండారెడ్డిని సోమవారం జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు. పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఇటీవల వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగులో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు జెడ్పీ ఛైర్మన్ కొండారెడ్డి నివాసానికి చేరుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమలో కోవెలకుంట్ల మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ రామసుబ్బయ్య, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి,సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 4.16 లక్షలకు రుసుం వసూలు వేలం

కోవెలకుంట్ల: మండల కేంద్రమైన సంజామలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రుసుం వసూలు(కనుగూలి)వేలం పాట గ్రామ పెద్దల సమక్షంలో జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి చిన్న రామ ఓబులేసు రూ. 4.16 లక్షలకు కనుగూలి వేలాన్ని దక్కించుకున్నారు. వచ్చే సంక్రాంతి పండగ వరకు గ్రామ పరిధిలో అన్ని రకాల పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలపై రుసుం వసూలు చేస్తారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజారెడ్డి, రఘురామయ్య, ప్రతాప్‌రెడ్డి, రవీంద్రుడు, మగ్బుల్ ఉసేన్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


మిత్రుడి కుమారుడు, కుమార్తెలను పరామర్శిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి కొద్ది రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఈ మేరకు బాధిత మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు. మిత్రులంతా కలసి రూ. 30 వేలను సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో కలసి చదువుకున్న మిత్రుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం బాధాకరమన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కోవెలకుంట్ల: స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లో సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన లీలావతి, వసంతకు రైస్, పప్పుకుక్కర్, కన్సలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి, కార్మిక సంఘం నాయకులు త్యాగరాజు, రాములమ్మ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


వృద్ధురాలి మృత దేహాన్ని తీసుకెళ్తున్న ఆ నల్గురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలోఉంటున్న అనాథ వృద్ధురాలు (80) ఆదివారం మరణించింది. పోలీసుల సూచన మేరకు ఆ నల్గురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషా, సభ్యులు సర్వజన స్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాఘవేంద్ర, అక్బర్, మా బాషా, పుల్లం రాజు, యూసుఫ్ పాల్గొన్నారు.

వీఆర్వోపై మంత్రికి పిర్యాదు

డోన్ టౌన్: మండల పరిధిలోని చెరువు పరిశీలనకు వచ్చిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి వెంకటాపురం గ్రామస్తులు వీఆర్వో మాధవస్వామిపై ఫిర్యాదు చేశారు. విధులకు గైరు హాజరుకావడంతో పాటు సచివాలయాల్లో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించకుండానే తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ భూములు, స్థలాలలను సైతం ఆన్ లైన్‌లో ఎక్కించడం లేదని ఆ గ్రామ ప్రజలు, రైతులు మంత్రి ఎదుట వాపోయారు. స్పందించిన మంత్రి విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.


మంత్రి బుగ్గనకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కనుల పండువగా చెన్నకేశవ స్వామి ఊరేగింపు

బేతంచెర్ల : మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో వెలసిన చెన్నకేశస్వామి ఊరేగింపు ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. భక్తులు స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ సమీపంలోని బావి వద్ద స్వామివారికి కలశ స్థాపన చేసి ప్రత్యేక పుష్పాలంకరణలో అలంకరించి మేళతాలల మధ్య గ్రామ పురవీధులగుండా భక్తులు భక్త పారవశ్యంలో శరీరంపై కొరడాలతో కొట్టుకుంటూ ఊరేగించారు. జై చెన్నకేశవ, గోవిందా... గోవిందా అంటూ భక్తులు చేసిన నినాదాలు హోరెత్యాఇ. ఉత్సవాల్లో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు, భక్తులు కేశాలు నాయుడు, నాగరాజు, రవిశంకర్, బాలరాజు, చిన్న శేషఫని, మహేష్, విజయ్, మాజీ ఎంపీటీసీ రంగస్వామి, మద్దయ్య అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


బుగ్గానిపల్లె గ్రామంలో భక్త జనసందోహం మధ్య చెన్నకేశవస్వామి ఊరేగింపు దృశ్యం

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

చెన్న కేశవస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. గెలుపొందిన కబడ్డీ జట్లకు రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున బహుమతులను అందజేశారు.

గిరిజనులకు సౌకర్యాలు అందించాలి


- రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్ నాయక్

అవుకు: కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులపై అశ్రద్ధ వహించకుండా వారికి అన్ని సౌకర్యాలు అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అధికారులకు సూచించారు. అవుకు మండల పరిధిలోని పిక్కళ్లపల్లి తండా, కొండమనాయునిపల్లె గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. గ్రామాల్లో తండావాసులతో సమావేశం ఏర్పాటు చేసి వారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజను అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారికి అందజేయాలని అధికారులకు సూచించారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ సెంటర్లు, శుద్ధజల కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పిక్కళ్లపల్లి తండాలోని శ్మశాన వాటిక సమస్య ఉందని, కొండమనాయునిపల్లె గ్రామంలోని ఎస్టీ కాలనీలో ప్రధాన విద్యుత్ కనెక్షన్లు కాలనీలోనే వెల్తున్నాయని, ఊరి వెలుపల నుంచి తీసుకువెళ్లాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం సరిగా అందింటంలేదని, పాఠశాలలకు ఉపాధ్యాయులు కూడా అంతంతమాత్రమే వస్తున్నారని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న స్పందించటం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని హెచ్చరించిన ఆయన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీధర్ రావుకు సూచించారు. కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవినాయక్, నాయకులు బాలునాయక్, రవీంద్ర నాయక్, నాయక్, జగదీశ్ నాయక్, సురేష్ నాయక్, విక్రమ్ నాయక్, రామచంద్రనాయక్,వెంకటేష్ నాయక్, పలువురు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

గురు శిష్యుల బంధం గొప్పది

బేతంచెర్ల: పూర్వకాలం నుంచి గురుశిష్యుల బంధం చాలా గొప్పదని రిటైర్డ్ ఎంఈఓ డీవీ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు రామిరెడ్డి, పిచ్చమరాజు, సుదర్శన్ రెడ్డి, వెంకటలక్షమ్మ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1996-97 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు చంద్రశేఖర్, డాక్టర్ కుసుమ కుమారి, శ్రీనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జగదీష్, మద్దిలేటి నాగలక్ష్మి, విజయలక్ష్మి, కమల, వరలక్ష్మి, నిర్మల ఆధ్వర్యంలో 25 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రిటైర్డ్ ఎంఈఓ డీవీ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు రామిరెడ్డి పిచ్చమరాజు, సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సమాజ సేవతోపాటు మీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని ఈ సందర్భంగా వారు పూర్వ విద్యార్థులకు సూచించారు.

వైభవంగా పార్వేట

కొలిమిగుండ్ల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొలిమిగుండ్ల కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ పూజారి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మాణంలో ఉండటంతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి తేరు మిద్దె వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి ఎస్సీ కాలనీ, ప్రధాన వీధుల్లో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంగా ఘనంగా జరిగింది. 2007-08 బ్యాచ్‌కు చెందిన దాదాపు 50 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వివిధ ఉద్యోగాలు, వృత్తులు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా ఒకేచోట సమావేశం కావడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. ప్రస్తుత హెచ్ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అలనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి హెచ్ఎం వనజ కుమారితో పాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేంద్రప్ప, మౌలాలి, శివశంకర్ రెడ్డి, ముజాయిద్ అలీ, దూద్‌సాహెబ్, సునీల్, పూర్వ విద్యార్థులు రవికుమార్, వినోద్ కుమార్, రవి, సురేశ్, శివప్రసాద్, నరేంద్రనాథ్ రెడ్డి, నాగరాజు, మనోహర్, యశోద, మస్తాన్ వలి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ మౌలానీ తెలిపారు. సోమవారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ కుమార్తె శ్రీదేవి ఇంటర్ వరకు విద్యనభ్యసించి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 14వ తేదీ సాయంత్రం నుంచి కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కలా, బంధువులను ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. దీంతో రామలక్ష్మమ్మ పోలీసులను ఆశ్రయించగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థిపై దాడి

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె గ్రామానికి చెందిన ఓ విద్యార్థిపై అదే గ్రామానికి చెందినవ్యక్తి దాడి చేసినట్లు ఎస్ఐ మౌలానీ తెలిపారు. సోమవారం ఎస్ తెలిపిన వివరాలకు మేరకు గరుడయ్య కుమారుడు శివరాం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం కుళాయి వద్ద గ్లాసు కడుక్కునే సమయంలో అటుగా వెళ్తున్న బాలయ్యపై నీళ్లు పడ్డాయి. దీంతో అతను విద్యార్థిని విచక్షణా రహితంగా కొట్టడంతో విద్యార్థి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారు బోల్తా... ఇద్దరికి స్వల్ప గాయాలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం కారు బోల్తాపడి ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కడప జిల్లా, పులివెందులకు చెందిన పాండురంగనాయక్, కృష్ణవేణి దంపతులు ఏపీ39ఎస్ఎల్7068 నంబర్ కారులో సొంతపనిపై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. కొత్తపల్లి వద్ద కారు అదుపు తప్పి కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు వివరించారు.

దుప్పట్లు పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: గౌండా మాధవ స్వామి సహకారంతో లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం రాత్రి రైల్వే స్టేషన్‌లోని అనాథలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వలీభాషా, రాజు, సభ్యులు మహేష్, మాధవ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిపక్షానికి అభివృద్ధి కనిపించడం లేదు

ప్యాపిలి: ప్రతిపక్ష టీడీపీ నాయకులకు డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ప్యాపిలి మండలంలో పలు చెరువులను పరిశీలించిన అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. నియోజవకర్గంలో శాశ్వత అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. డోన్‌లో 100 పడకల ఆసుపత్రి, రూ. 300 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులు, చెరువులకు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీటిని నింపే కార్యక్రమం, 90 శాతానికి పైగా గ్రామాలకు రోడ్ల నిర్మాణం వంటి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా టీడీపీ నాయకులు 'ఇదేం ఖర్మ' అంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేయడమే ఖర్మనా ? అని టీడీపీ నాయకులను మంత్రి ప్రశ్నించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం తనను భర్త, వదిన, అత్త, మామ వేధిస్తున్నారని మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన వివాహిత పోలీస్ స్టేషన్ ఆశ్రయించింది. గ్రామానికి చెందిన ఉన్నం సురేష్‌తో బేతంచెర్ల పట్టణానికి చెందిన భవానీకి 2021 మేలో వివాహం జరిగింది. కొంత కాలంగా భర్త ఉన్నం సురేష్, వదిన సురేఖ, అత్త,మామ సరస్వతమ్మ, వెంకటేశ్వర్లు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రియతం రెడ్డి సోమవారం తెలిపారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

బనగానపల్లె: గిరిజన సమస్యలపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.శంకర్‌నాయక్ సోమవారం కలిశారు. ఈ మేరకు నియోజకవర్గంలో గిరిజన గ్రామాలు నెలకొన్న సమస్యలపై శంకర్‌నాయక్ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసానికి సంక్రాంతి శుభాకాక్షలు తెలుపుతూ దుశ్శాలువతో సన్మానించారు. అంతకుముందు అవుకు మండలం కొండమనాయునిపల్లితండా, పిక్కిళ్లిపల్లి తండాలను శంకర్‌నాయక్ సందర్శించి, గిరిజన సమస్యలను తెలుసు కొని పరిష్కారించేందుకు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసనాయక్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ జిల్లానాయకులు ఈశ్వర్‌నాయక్, రామ్‌నాయక్, రవినాయక్, బాలునాయక్, రామంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణంలోని చల్లా కార్యాలయంలో దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వర్తీయ శంకర్ నాయక్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దివంగతనేత చల్లా రామకృష్ణారెడ్డి మరణించిన కొద్దికాలంలోనే చల్లా భగీరథ్ రెడ్డి మృతి చెందడం చల్లా కుటుంబానికి తీరని లోటని ఆయన అన్నారు. అలాగే అవుకు మండలంలోని గిరిజనుల సంక్షేమంపై ఆమెతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా విక్రాంత్ రెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, నంద్యాల జిల్లా గిరిజన అధ్యక్షులు బాలునాయక్, బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

29న ఉభయ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన హాజరత్ అల్లాబకాష స్వామివారి ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 29న ఉభయ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.30, రూ. 20 వేలు, రూ. 10 చొప్పున అందజేస్తామన్నారు. పోటీలలో పాల్గొనే వారు రూ. 800 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో సంక్రాంతి సండుగ సందర్భంగా సోమవారం గ్రామ పెద్దల, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో న్యూక్యాటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. 18 జతల వృషభాలు పాల్గొన్న పోటీను సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నంద్యాల జిల్లా పెద్దకోట్టాల గ్రామానికి చెందిన బొరెడ్డి కేశరెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా, చత్రాయిపేట చెందిన రవీంద్రారెడ్డి వృషభాలు, కర్నూలు జిల్లా, కన్నాపురం గ్రామానికి చెందిన తలారికాంత్ వృషభాలు నిలిచి వరసగా రూ. 50వేలు, రూ.35 వేలు, రూ. 25 వేలు కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో అనంతపురం జిల్లా సోదనపల్లికి చెందిన ప్రసాద్‌నాయుడు వృషభాలు, మేడిమకలపల్లికి చెందిన తోటతిరుపాల్‌రెడ్డి వృషభాలు, జక్కలచెరువుకు గోపాల్ వృషభాలు, నంద్యాల జిల్లా, గోర్లగుట్టకు చెందిన ఇంద్రసేనారెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా, ఉబ్బిచెర్లకు చెందిన గోవింద్ వృషభాలు నిలిచాయి. ఈ వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 15వేలు, రూ. 10వేలు, రూ. 8వేలు, రూ. 6వేలు, రూ. 5 వేలు చొప్పున దాతలు అందజేశారు.

ఘనంగా శివపార్వతుల గ్రామోత్సవం


యాగంటిపల్లె గ్రామంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: సంక్రాంతి పర్వదిన వేడుకల్లో భాగంగా మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఛైర్మన్ తొటబుచ్చిరెడ్డి. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పల్లకీలో ముస్తాబు చేసి పాతపాడు గ్రామానికి తీసుకొచ్చి గ్రామోత్సవం చేశారు. అక్కడి నుంచి మీరాపురం, రాత్రికి యాగంటిపల్లెకు చేరుకున్నారు. మళ్లీ సోమవారం ఉదయం యాగంటిపల్లె నుంచి శివపార్వతులను గ్రామోత్సవం ద్వారా మాదనుపల్లె, పాతపాడు గ్రామం మీదుగా యాగంటి క్షేత్రానికి చేర్చారు. ఆయా గ్రామాల ప్రజలు శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తుల చెంతకే పాండురంగడు


పాండురంగ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు భక్తుల చెంతకు చేరి పూజలందుకున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పార్వేట ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్వేట సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం మండల పరిధిలోని సౌదరదిన్నె, అమడాల గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. పార్వేటను పురస్కరించుకుని ఎస్సీ కుటుంబాల్లోని వ్యక్తులు ఉపవాసదీక్షలు ఆచరించారు. పాండురంగస్వామి అశ్వవాహనంపై ఊరేగింపుగా గ్రామంలోకి రాగానే ఆ కుటుంబాలకు చెందిన చిన్నారులు పార్లుదండాలతో స్వామి వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని పూలమాలలతో అలంకరించి ఖడ్గాలు చదువుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉపవాసదీక్ష విరమించారు. అక్కడి నుంచి పాండురంగని ఊరేగింపు అమడాల గ్రామానికి చేరుకోగా ప్రజలు ఘనస్వాగతం పలికి పూజలు చేశారు. ఉత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.